

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,97,111లు, బంగారం 2 గ్రాముల 150 మిల్లీగ్రాములు, వెండి 69 గ్రాముల 800 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



జెడ్పీ సమావేశం బహిష్కరణ

జిల్లా పరిషత్ సమావేశాలను బుధవారం సమితి చైర్మన్లు, జెడ్పీటీసీలు, సమితి సభ్యులు, సర్పంచులు బహిష్కరించారు.

- 10లో▸



'మత్తు' ముఠా అరెస్టు

మత్తు కలిగించే ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముగ్గురు యువకులను జయపురం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు.

- 10లో▸

న్యూస్‌రీల్

ఆటో చోరీపై ఫిర్యాదు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న మురళి నాయక్ కు చెందిన ఆటో మంగళవారం రాత్రి చోరీకి గురయ్యింది. ఎప్పటిలాగే తన విధులు పూర్తి చేసుకుని ఆటోను ఇంటి ముందు పెట్టి లోపలకు వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున ఆటో నడిపేందుకు వచ్చి చూస్తే కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు అనుమానించి వెంటనే టికిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

బాలింతకు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న మహిళ

రాయగడ: నెలలు నిండి పురిటినొప్పులతో బాధపడి మృత శిశువుకు జన్మనిచ్చిన మహిళ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో జననీ ఎక్స్‌ప్రెస్ అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా బొలెరో వాహనం ఢీకొట్టింది. కళ్యాణసింగుపూర్ సమితి నారాయణపూర్ పంచాయతీ ఖొటొగొంత గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ఖొటొగొంత గ్రామానికి చెందిన దాసీతియక భార్య కుని వడక తీవ్ర గాయాల పాలైంది. అనంతరం ఆమెను ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నబరంగపూర్‌లో ఐజీ పర్యటన



లక్కబొమ్మలు కొనుగోలు చేస్తున్న ఐజీ జయనారాయణ పంకజ్

కొరాపుట్: ఇంటెలిజెన్స్ ఐజీ జయనారాయణ పంకజ్ నబరంగ్‌పూర్ జిల్లాలో రహస్య పర్యటన చేశారు. తొలుత ఉమ్మర్‌కోట్ పట్టణంలో పర్యటించి అనంతరం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఎస్పీ మిహిర్ పండాను కలిసి పలు అంశాలపై చర్చించారు. తిరుగు ప్రయాణంలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన సుంకారి మహిళలు తయారు చేస్తున్న లక్క బొమ్మల కేంద్రాన్ని సందర్శించారు. ఆయనతో పాటు నబరంగ్‌పూర్ ఇంటెలిజెన్స్ డీఎస్పీ నరేంద్ర కుమార్ మజ్జి, సిబ్బంది అశోక్ పట్నాయక్ ఉన్నారు.

అఘాసురుడి వధ అలంకరణలో శ్రీమదన మోహనుడు



భువనేశ్వర్: ఆనందోత్సాహాలతో కొనసాగుతున్న వెలుపలి చందన యాత్రలో స్వామి రోజుకో ఆకర్షణీయమైన అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చి మురిపిస్తున్నాడు. ఎనిమిదో రోజైన బుధవారం చందన యాత్రలో శ్రీమదన మోహనుడుని నరేంద్ర పుష్కరిణి చందన వేదికపై అఘాసుర వధ అలంకరణలో భక్తులు దర్శించుకుని తరించారు.



కొరాపుట్: మాక్ డ్రిల్ ని పర్యవేక్షిస్తున్న కలెక్టర్ వీ.కీర్తివాసన్, ఎస్పీ రోహిత్ వర్మ

మాక్‌డ్రిల్ సక్సెస్



కొరాపుట్: పోలీస్ గ్రౌండ్స్‌లో మాక్ డ్రిల్

- ఆకట్టుకున్న పోలీసు విన్యాసాలు
- సహకరించిన అన్ని వర్గాల ప్రజలు
- కొరాపుట్‌లో కర్ఫ్యూ వాతావరణం

కొరాపుట్:

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కొరాపుట్ జిల్లా కేంద్రంలో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. సాయంత్రం 4 నుంచి 4.20 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంతో పట్టణంలో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. అవిభక్త కొరాపుట్ జిల్లాలలో కేవలం కొరాపుట్‌నే కేంద్ర ప్రభుత్వం మాక్ డ్రిల్‌ని ఎంపిక చేసింది. ఇక్కడికి 25 కిలో మీటర్ల దూరంలో సునాబెడాలో యుద్ధ విమానాలు ఇంజన్లు తయారు చేసే హిందూస్థాన్ ఏరో నాటిక్స్ లిమిటెడ్ కేంద్రం ఉంది. ఈ నేపథ్యంలో ముందుగా పెద్ద సైరన్ మోగించారు. ఇది విన్న వెంటనే వర్తక వాణిజ్య సంస్థలు ఎక్కడికక్కడే మూసి వేశారు. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పోలీసులు, సివిల్ డిఫెన్స్ యూనిట్స్, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాలు పట్టణంలో కలియతిరుగుతూ రోడ్లపై ఉన్న వారికి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కలెక్టర్ వీ.కీర్తివాసన్, ఎస్పీ రోహిత్ వర్మ మాక్‌డ్రిల్ పర్యవేక్షించారు. అగ్ని మాపక సిబ్బంది, ఓడ్రాప్ బృందాలు రోడ్లను క్లియర్ చేశారు. కొంత సేపు మనుషుల అలజడి కనిపించలేదు. యుద్ధం వస్తే తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై వలంటీర్లు ప్రజలను అవగాహన కలిగించారు. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో ప్రదర్శనలు జరిగాయి.

రాయగడలో..

రాయగడ: యుద్ధం వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై జిల్లా పోలీస్ యంత్రాంగం బుధవారం రాయగడ పట్టణంలో మాక్ డ్రిల్ నిర్వహించింది. మెయిన్ మార్కెట్, సాయి ఇంటర్నేషనల్, కొరాపుట్ కూడలి, జ్యోతి మహల్ ప్రాంతాల్లో సాయంత్రం రన్లు మోగించారు. ఆ సమయంలోబహిరంగ ప్రదేశాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. కార్యక్రమంలో పోలీసులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భువనేశ్వర్‌లో..

భువనేశ్వర్: కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు భువనేశ్వర్, ఖుర్ధా, బాలాసోర్, భద్రక్, కేంద్రాపడా, గంజాం, జగత్‌సింగ్‌పూర్, ఢెంకనాల్, పూరీ, కొరాపుట్, సుందర్‌గఢ్, అంగుల్‌లలో బుధవారం మాక్ డ్రిల్స్ జరిగాయి. స్థానిక రాజ్‌మహల్ స్క్వేర్ నుండి శిశు భవన్ స్క్వేర్, బాపూజీ నగర్ ప్రాంతం వరకు మాక్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో జంట నగరాల పోలీస్ కమిషనర్ సురేష్ దేవ్ దత్తా సింగ్, డీఐజీ ఉమా శంకర్ దాష్, డీఎం ఖుర్ధా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేటు, డీసీపీ జగమోహన్ మీనా పాల్గొన్నారు.



కొరాపుట్: బారులు తీరిన పోలీసు బలగాలు



కొరాపుట్: సివిల్ డిఫెన్స్ యూనిట్స్



రాయగడ: పోలీస్ బలగాలు



రాయగడ: విద్యార్థుల అవగాహన ర్యాలీ



భువనేశ్వర్:ఆపత్కాల పరిస్థితుల్లో ప్రజలు పాటించాల్సిన మెలకువలపై శిక్షణ



భువనేశ్వర్: భవనాలలో చిక్కుకున్న వారిని సురక్షితంగా తరలిస్తూ..

చెట్టును ఢీకొట్టిన బైక్

- కొడుకు మృతి, తండ్రికి గాయాలు



గాయపడిన దయాను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం





బిజు మృతదేహం (ఇన్‌సెట్లో) బిజు (ఫైల్)

రాయగడ: బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టిన సంఘటనలో తండ్రికి తీవ్రగాయాలవ్వగా కొడుకు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కడిసిల్ ఘాట్ రోడ్డు వద్ద మంగళవారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటనలో మృతుడు టికిరి పంచాయతీలోని రాముగుడ గ్రామానికి చెందిన బిజు మాఝి (22), గాయాలు తగిలిన వ్యక్తిని దయా మాఝిగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేశారు. బిజు మాఝి మృత దేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. క్షతగాత్రుడుని కాసీపూర్ పీహెచ్‌సీకి చికిత్స కోసం అంబులెన్స్‌లో తరలించారు. టికిరి పోలీస్ స్టేషన్ ఎస్సై ప్రిస్కా ఓటు, ఏఎస్సై నరేష్ రావల్ తెలియజేసిన వివరాల ప్రకారం.. తండ్రి దయా, కొడుకు బిజు మాఝిలు మంగళవారం నాడు తమ స్వంత పనులపై కాసీపూర్ వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వెళుతున్న సమయంలో దుడుకాబహాల్ పంచాయతీలోని కడసిల్ ఘాటి మలుపులో బైకు అదుపుతప్పి చెట్టుకు ఢీకొంది. దీంతో బైకు నడుపుతున్న బిజు కొంతదూరం ఎగిరిపడియాడు. తీవ్రగాయాలకు గురై సంఘటన స్థలం వద్దే ప్రాణాలు విడిచాడు. తండ్రి దయాకు తీవ్రగాయాలయ్యాయి.

సైన్యం ధైర్యం దేశానికి గర్వకారణం

భువనేశ్వర్: ఆపరేషన్ సిందూర్ పురస్కరించుకుని భారత సైన్యం ప్రదర్శించిన ధైర్య సాహసాలు జాతికి గర్వ కారణమని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మన సంస్కృతిలో సిందూర్ అనేది కేవలం సంప్రదాయం మాత్రమే కాదని త్యాగం, దృఢ సంకల్పానికి చిహ్నమని పేర్కొన్నారు. ఈ భావన మన సైనికుల హృదయాల్లో కూడా పదిలమై శత్రు సేనని అవలీలగా మట్టి కరిపించిందన్నారు. భారత దేశం తనను తాను రక్షించుకోవడం మాత్రమే కాకుండా ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించడానికి దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోందని కొనియాడారు. సైన్యంతో కలిసి నిలబడదామని పిలుపునిచ్చారు. భారత్ మాతా కీ జై నినాదంతో భారత సేనతో నిలుద్దామని పేర్కొన్నారు.

ఇద్దరు నకిలీ రైల్వే ఉద్యోగుల అరెస్టు



అరెస్టయిన నకిలీ ఉద్యోగులు వీరే

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ఖుర్ధారోడ్ మండలం పరిధిలో ఇద్దరు నకిలీ రైల్వే ఉద్యోగుల గుట్టు రట్టయ్యింది. రైలు పట్టాల పర్యవేక్షణ కొనసాగుతుండగా వీరివురి వ్యవహారం బట్టబయలైంది. బొగాడియా పాసింజరు హాల్టు (పీహెచ్) వద్ద స్టేషన్ మాస్టర్ యూనిఫాం ధరించి సిబ్బంది తరహాలో ఆకుపచ్చ జెండా ఊపుతు రైలు రవాణా నియంత్రిస్తున్న దృశ్యం అధికారుల దృష్టికి వచ్చింది. సదరు సిబ్బంది వ్యవహారంపై అనుమానం రావడంతో విచారణ జరపగా నకిలీల గుట్టు వెలుగు చూసినట్లు పారాదీప్ డీటీఐ తెలియజేశారు. కటక్ రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్) చేరుకుని నకిలీ స్టేషను మేనేజరుతో సహా మరో వ్యక్తిని అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన నకిలీ రైల్వే ఉద్యోగులను రాజ్ కుమార్ పుర్తీ, చరణ్ బోద్రాగా గుర్తించారు. వీరు ఇద్దరు జార్ఖండ్ నివాసితులు. రాజ్‌కుమార్ పుర్తీ స్టేషన్ మాస్టర్‌గా నటించగా, చరణ్ బోద్రా టోకెన్ పోర్టరు (టీపీ)గా పరిచయం చేసుకుని చలామణి అవుతున్నాడు. ఒకరు స్టేషన్ మేనేజర్ (ఎస్ఎం) తెలుపు రంగు యూనిఫాంలో మరొక వ్యక్తి టోకెన్ పోర్టరు (టీపీ) దుస్తుల్లో నకిలీ గుర్తింపు కార్డులు సృష్టించి రైల్వే కార్యకలాపాలు సాగిస్తున్నారు. రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని నిరుద్యోగ యువత నుంచి డబ్బు గుంజుతున్న ప్రధాన సభ్యులలో తానూ ఒకడినని రాజ్ కుమార్ పుర్తీ విచారణలో అంగీకరించాడు. బీహార్‌కు చెందిన సంతోష్ కుమార్ పాత్రో ఈ ముఠా అధిపతిగా పేర్కొన్నాడు. నిందితులపై రైల్వే చట్టంలోని బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

హోటళ్లపై అధికారుల దాడులు



హోటల్‌లో వంటలకు వినియోగించే పదార్థాలను తనిఖీ చేస్తున్న అధికారులు

- రూ. 20 వేల జరిమానా వసూలు



అధికారులు గుర్తించిన నిల్వ, పాడైన పదార్థాలు

జయపురం: జయపురం పట్టణంలో ఆహార పదార్థాలు అమ్ముతున్న దుకాణాలు, హోటళ్లపై మంగళవారం సాయంత్రం మున్సిపాలిటీ సిబ్బంది, ఆహార సురక్షా విభాగ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. హోటళ్లలో పరిశుభ్రత, ఆహారంలో నాణ్యత, ఆహార పదార్థాలు వండేందుకు వినియోగిస్తున్న వస్తువుల క్వాలిటీ, వంట సామగ్రి పరిశుభ్రతను పరిశీలించారు. కొన్ని దుకాణాల్లో నిల్వ ఉన్న ఆహార పదార్థాలు, పాచిన వంట పదార్థాలను కనుగొని వాటిని పారబోశారు. వంటలకు వినియోగిస్తున్న నూనె నాణ్యతను తనిఖీ చేశారు. ఆరు దుఖాణాల్లో తనికీలు చేసిన అధికారులు వాటి యజమానుల నుంచి రూ. 20 వేలు జరిమానా వసూలు చేసినట్లు అధికారులు బుధవారం వెల్లడించారు. పట్టణంలో పెద్ద హోటళ్లైన సిగ్నేచర్, మా తరణీ, హోటల్ హై అండ్ హిల్‌లపై దాడులు నిర్వహించారు. దాడుల్లో ఆహార భద్రత అధికారి ప్రసాద్ కుమార్ సెట్టి, జయపురం మున్సిపాలిటీ అదనపు కార్యనిర్వాహక అధికారి కృతి బాస సాహు, జగదీష్ రావు, భువణీ హల్దు, సత్య పాత్రో పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి



వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం



ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



అమ్మవారికి అలంకరించేందుకు బంగారు కిరీటం తీసుకొస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



పవిత్ర జలాలను తీసుకొస్తున్న మహిళలు



జయపురంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు

కళింగ వైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు జయపురంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక మహారాణిపేటలో బుధవారం ఉదయం వైశ్య మహిళలు కలశాలతో హాజరయ్యారు. అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి మంగళ వాయిద్యాల నడుమ వేలాది మంది భక్తుల సమక్షంలో బంగారు కిరీటాన్ని అలంకరించారు.

– జయపురం

క్లుప్తంగా

పోడియాలో ఎస్‌బీఐ బ్రాంచి ప్రారంభం



కొత్త బ్యాంక్ లాకర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఎదురుగా కొత్తగా నిర్మించిన భవనాన్ని స్టేట్ బ్యాంక్ శాఖను భువనేశ్వర్ స్టేట్ బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ దినేశ్ పృధ్య బుధవారం ప్రారంభించారు. పోడియా సమితిలో ఎనిమిది పంచాయతీల పరిధిలోని 30 వేల మందికి బ్యాంక్ అందుబాటులో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి స్టేట్ బ్యాంక్ మేనేజర్ సుబాష్ చంద్రబెహర, పోడియా సమితి అభివృద్ధి అధికారి అశ్విని కుమార్ విశోయి, పోడియా ఆరోగ్య శాఖ అధికారి శేషదేవ్ బెహరా, పోడియా పోలీసు స్టేషన్ ఎస్‌ఐ నిరోద్ కుమార్ బాఘ్ పాల్గున్నారు

కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు



వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు



ఎమ్మెల్యేకు పట్టువస్త్రాలు అందజేసిన చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ పొట్నూరు రామ

పర్లాకిమిడి: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ జయంతి సందర్భంగా పర్లాకిమిడి కొత్తబస్టాండు సమీపంలోని కంద్రవీధి వద్ద ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళింగ వైశ్యం సంఘం అధ్యక్షుడు వైశ్యరాజు బాలాజీరాజు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ పొట్నూరు రామ, బరాటం నాగేశ్వరరావు, మధు తదితరులు ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి పూజలు చేశారు. ప్రధాన అర్చకులు వనమాలి మణిశర్మ నేతృత్వంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, పురపాలక సంఘం వైస్ చైర్మన్ లెంక మధులు హాజరయ్యారు.

నబరంగ్‌పూర్‌లో సీఎస్ పర్యటన



మొక్కజొన్న రైతులతో మాట్లాడుతున్న సీఎస్ మనోజ్



జీడి పరిశ్రమను పరిశీలిస్తున్న సీఎస్, కలెక్టర్లు

కొరాపుట్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్ అహుజా నబరంగ్‌పూర్ జిల్లాలో బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. జిల్లా సరిహద్దులో కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో ఘన స్వాగతం పలికారు. అనంతరం డైబెట గ్రామానికి వెళ్లిన సీఎస్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణ పురోగతి పరిశీలించారు. ముఖ్యమంత్రి జీవనోపాధి మిషన్ కింద లబ్ధి పొందిన మొక్కజొన్న, పొద్దు తిరుగుడు పంటల ఉత్పత్తిదారులతో సమావేశమయ్యారు. టీస్టాల్స్, పవర్ ట్రిల్లర్లు, గ్యారేజీ వస్తువుల తయారీదారులతో భేటీ అయ్యారు. తారాగాంలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం, పశు పోషణ శిక్షణా శిబిరాన్ని సందర్శించారు. సెమ్లా గ్రామంలో ఏకలవ్య మోడల్ స్కూల్, కొసాగుమ్డలో నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. సీఎస్ వెంట కలెక్టర్ శుభంకర్ మహాపాత్రో, ఎస్పీ మిహిర్ పండా ఉన్నారు.



మిలెట్ మిషన్ ప్రాజెక్ట్ పరిశీలన

జెడ్పీ సమావేశం బహిష్కరణ



చైర్మన్‌లు, జెడ్పీటీసీలు బహిష్కరించడంతో ఖాళీగా మొదటి లైన్ సీట్లు

- మాకు చెప్పకుండానే పనులపై నిర్ణయం తీసుకోవడం తగదు
- అధికారుల తీరుపై బ్లాక్ చైర్మన్లు, జెడ్పీటీసీలు మండిపాటు

పర్లాకిమిడి: జిల్లా పరిషత్ సమావేశాలను బుధవారం సమితి చైర్మన్లు, జెడ్పీటీసీలు, సమితి సభ్యులు, సర్పంచులు బహిష్కరించారు. సమితి అధ్యక్షులు, గ్రామసభల ప్రమేయం లేకుండానే డి.ఆర్.డి.ఎ. అధికారులు వివిధ అభివృద్ధి పనులపై నిర్ణయాలు తీసుకుంటున్నారని, ప్రజలకు తాము ఏం సమాధానం చెబుతామని కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ ప్రశ్నించారు. ఏడు సమితిల్లో ఆరు సమితుల చైర్మన్‌లు, పలువురు జెడ్పీటీసీలు, సమితి సభ్యులు జిల్లా పరిషత్ సమావేశాలను బహిష్కరించారు. సుమారు రెండు గంటలసేపు సమావేశం నిలిచిపోవడంతో కలెక్టర్ బిజయకుమార్ దాస్ విచారం వ్యక్తం చేశారు. డి.ఆర్.డి.ఎ. సి.డి.ఎం. శంకర్ కెరకెటా, మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో, పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి తదితరు చైర్మన్లను బుజ్జగించినా ఫలితం లేకపోయింది. బీజేపీ ప్రభుత్వం వచ్చాక సమితి చైర్మన్ల విస్తృత అధికారాలు తీసివేసే ధోరణిలో పాలన సాగుతోందని, పనుల్లో 60 శాతం కోత విధిస్తున్నారని, చివరకు సామాజిక పింఛన్లు కూడా ఎంపీ సిఫారసులతో ఆమోదం జరిగిపోతున్నాయని ఆరోపించారు.



డి.ఆర్.డి.ఏ. అదనపు ప్రాజెక్టు అధికారి పృథ్వీరాజ్‌తో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్లు

బహిష్కరిస్తే ప్రజలకే నష్టం..

జిల్లా పరిషత్ సమావేశాలు ఉదయం 9.30 గంటలకు జరగాల్సి ఉండగా 11.30 గంటలకు రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు, కలెక్టర్ బిజయకుమార్ దాస్, డి.ఆర్.డి.ఎ. అధికారులు హాజరయ్యారు. జిల్లా పరిషత్ సమావేశాలను సమితి అధ్యక్షులు, జెడ్పీటీసీలు బహిష్కరిస్తే ప్రజలకే నష్టమని, వచ్చే పంచాయతీ ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకుని ప్రజల వద్దకు ప్రజాప్రతినిధులు వెళ్తారని కాంగ్రెస్ ఎమ్మెల్యే దాశరథి గొమాంగో ప్రశ్నించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం గ్రామసభలు ఆమోదం లేకుండా ఏ ప్రభుత్వ పనులు జరగవని కలెక్టర్ దాస్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన పథకాలు నిధులు ఖర్చు కావాలంటే పార్టీలకు అతీతంగా పనిచేయాలని చెప్పారు.



అధికారులను ఉద్దేశిస్తూ మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి



డి.ఆర్.డి.ఎ. కార్యాలయం ఆవరణలో అధికారులు, ప్రజాప్రతినిధుల వాగ్వాదం

ఆపరేషన్ సిందూర్



ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రముఖ సైకత శిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ పూరీ సాగర తీరంలో అద్భుత సైకత శిల్పం ఆవిష్కరించారు. భారత మాత ధాటికి ఉగ్రశిబిరాలు ధ్వంసమైన దృశ్యంతో రూపుదిద్దుకున్న ఈ శిల్పం సందర్శకుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది. - భువనేశ్వర్/పూరీ

జగన్నాథ విగ్రహ తయారీ చెట్టు గుర్తింపు



గుర్తించిన చెట్టు వద్ద వేదపండితులు

కొరాపుట్: జగన్నాథ స్వామి విగ్రహాన్ని తయారు చేయడానికి అర్హత ఉన్న చెట్టుని వేద పండితులు గుర్తించారు. కొరాపుట్ జిల్లా బొరిగుమ్మ సమితి బి.సింగ్‌పూర్ పంచాయతీ కుమిలి గ్రామంలో నిర్మిస్తున్న జగన్నాథ దేవాలయంలో విగ్రహం తయారీకి అవసరమైన కలప కోసం పండితులు అన్వేషించారు. నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి దోహన గ్రామ సమీపంలో వేప చెట్టుకి అన్ని అర్హతలు ఉన్నాయని పండితుల బృందం గుర్తించింది. వెంటనే పూజలు నిర్వహించి రంగు వస్త్రం చుట్టారు. పూరీ నుంచి శిల్పులు వచ్చి ట్టుని నరికి ఆ కలపతో జగన్నాథ విగ్రహం చెక్కనున్నారు.

పక్క జిల్లాల కిన్నెరల ఆగడాలు అడ్డుకోండి

- మంత్రికి నబరంగ్‌పూర్ కిన్నెరల వినతి

కొరాపుట్: పక్క జిల్లాల కిన్నెరల ఆగడాలను అడ్డుకోవాలని నబరంగ్‌పూర్ జిల్లా కిన్నెర సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ, మైనారిటీ, ప్రాథమిక విద్యాశాఖా మంత్రి నిత్యానంద గొండోని కలిసి విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని కిన్నెరలు ఎక్కడా డబ్బులు యాచించడం, సంఘ విద్రోహ పనులు చేయడం లేదన్నారు. తాము సంఘంగా ఏర్పడి వివిధ వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిర పడ్డామన్నారు. తమకు ప్రభుత్వం నుంచి కూడా గుర్తింపు, సహాయ సహకారాలు వస్తున్నాయని మంత్రికి వివరించారు. కానీ పక్కనే ఉన్న కలహండి జిల్లా నుంచి కొందరు కిన్నెరలు మంత్రి నియెజకవర్గం ఉమ్మర్‌కోట్‌లో తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకొని ఆసాంఘిక పనులు చేస్తున్నారన్నారు. ఇది జిల్లాలో కిన్నెరలకు చెడ్డ పేరు తెస్తుందన్నారు. వారి కదలికల పై చర్యలు తీసుకోవాలని మంత్రిని వేడుకున్నారు. బీజేపీ నాయకురాలు షర్మిష్టా దేవ్, సంఘం ప్రెసిడెంట్ కాజల్, చంకి కిన్నెర, మందిరా నాయక్, సత్యవతి నాయక్ ఉన్నారు.



మంత్రి నిత్యానంద గొండోకి వినతి పత్రం అందజేస్తున్న నబరంగ్‌పూర్ కిన్నెరలు

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

రాయగడ : జిల్లా అభివృద్ధి సమన్వయం నిర్వహణ కమిటీ (దిశా) సమీక్ష సమావేశంలో పలు కీలక అంశాలపై వాడీవేడి చర్చ జరిగింది. దిశా కమిటీ చైర్మన్, కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక అధ్యక్షతన స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారి, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి అక్షయకుమార్ ఖెముండొ, గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగొ, రాయగడ ఎమ్మెల్యే ప్రతినిధి దుర్గాప్రసాద్ పండా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ సప్తగిరి ఉలక మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న గుణుపూర్ -తెరువలి రైల్వే నిర్మాణం పనుల ప్రగతిపై రాయగడ డీఆర్ఎం అమితాబ్ సింఘాల్‌ను అడిగి తెలుసుకున్నారు. రైల్వే డివిజన్‌గా గుర్తింపు పొందిన రాయగడలో అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ప్రధానమంత్రి సడ్ యోజనపై సుదీర్ఘంగా చర్చించిన ఈ సమావేశంలో 449 ప్రాజెక్టు పనులకు గాను 436 పనులు ఇప్పటికే పూర్తయ్యాయని సంబంధిత శాఖ అధికారులు తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీ సప్తగిరి. పక్కనే కలెక్టర్ పట్వారి తదితరులు

నేను క్షేమమే: మంత్రి జుయెల్

భువనేశ్వర్ : 'ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కీలకమైన ప్రాజెక్టులు, పథకాలను ఖరారు చేయడానికి శాఖ సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహిస్తున్నాను. నేను పూర్తిగా క్షేమంగా ఉన్నాను. నా విధులకు పూర్తిగా కట్టుబడి ఉన్నాను. వ్యాప్తి చెందుతున్న పుకార్లు పూర్తిగా నిరాధారమైనవి. ప్రతి ఒక్కరూ వాస్తవాలపై దృష్టి సారించి తప్పుడు సమాచారానికి గురి కావద్దని కోరుతున్నాను' అంటూ కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి, సుందర్‌గఢ్ లోక్‌సభ నియోజకవర్గం ప్రతినిధి జుయెల్ ఓరాం స్పష్టం చేశారు.

ఈ మేరకు సోషల్‌మీడియా వేదికగా ప్రకటన విడుదల చేశారు. జుయెల్ ఓరం ఢిల్లీ నుంచి జబల్‌పూర్ వెళ్తుండగా రైలు నుంచి తప్పిపోయినట్లు విస్తృతంగా ప్రచారం కావడంతో తన యోగక్షేమాలకు సంబంధించి ఫొటోలతో సందేశం విడుదల చేశారు.



సమావేశంలో కేంద్ర మంత్రి జుయెల్ ఓరాం

సాయుధ దళాలకు జైహింద్

భువనేశ్వర్: సాయుధ దళాల శౌర్యం, వ్యూహాత్మక కచ్చితత్వం, అచంచల అంకితభావానికి అద్భుతమైన నిదర్శనంగా ఆపరేషన్ సిందూర్ నిలిచిందని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ప్రశంసించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారతదేశం సార్వభౌమత్వానికి ఎదురయ్యే ఏ ముప్పునైనా ఎదుర్కొనేందుకు తన దృఢమైన వైఖరిని పునరుద్ఘాటించిందని పేర్కొన్నారు. భారతదేశం ఏ రూపంలోనైనా ఉగ్రవాదాన్ని సహించదని స్పష్టం చేశారు.

ఒక దేశం..ఒక ఎన్నికపై వర్క్‌షాపు



వేదికపై ప్రసంగిస్తున్న అతిథులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని రాజేశ్వరీ ప్యాలెస్‌లో ఒక దేశం ఒక ఎన్నిక అనే అంశంపై బుధవారం మేధావుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ పరిడా మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో 47 రాజకీయ పార్టీలుండగా , అందులో 32 పార్టీలు ఒక దేశం ఒక ఎన్నిక ప్రతిపాదనకు మద్దతు ప్రకటించాయని చెప్పారు. ప్రజల్లో సైతం ఈ విషయమై చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ ప్రతినిధి రాజేష్ కుమార్ పట్నాయిక్, సొమేంద్ర కుమార్ జెన్నా తదితరులు పాల్గొన్నారు.

పోడియా సమితి అధ్యక్షుడిగా చిన్నమ్



చిన్నమ్‌ను సత్కరిస్తున్న పార్టీ కార్యకర్తలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పోడియా సమితి బీజేడీ అధ్యక్షుడిగా చిన్నమ్ రాబిడ్ నియమితులయ్యారు. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో చిన్నమ్ కీలక పాత్ర వహించారు. ఈ సందర్భంగా చిన్నమ్‌ను బుధవారం సమితి కార్యాలయంలో పార్టీ కార్యకర్తలు సత్కరించారు.

టెన్త్ విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్

పర్లాకిమిడి: రాష్ట్రవ్యాప్తంగా పది బోర్డు పరీక్షల్లో 99.35 శాతం ఉత్తీర్ణత సాధించి, 15 మందికి ఏ-1గ్రేడ్ సాధించిన విద్యార్థులను గజపతి జిల్లా ముఖ్యశిక్షాధికారి ఆధ్వర్యంలో కలెక్టర్ బిజయ కుమార్ దాస్ బుధవారం ఆర్‌శెఠి భవనంలో అభినందించి సత్కరించారు. ఆర్.ఉదయగిరి బ్లాక్ కె.ఎన్.బలియాసాహి గ్రామానికి చెందిన తండ్రిలేని పేద విద్యార్థి చంద్రశేఖర దోళాయి 600 మార్కులకు 543 సాధించి ఫస్టుక్లాస్ సాధించినందుకు ఉన్నత చదువుల ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతి రావు, డీఎఫ్‌వో కె.నాగరాజు, జిల్లా ఎస్పీ జ్యోతీంద్రనాథ్ పండా, పురపాలక చైర్మన్ నిర్మళా శెఠి, పి.ఓ. ఐ.టి.డి.ఏ. అంశుమాన్ మహాపాత్రో, డీఈవో డాక్టర్ మాయాధర్ స్వయిని, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సాల్మన్ రైకా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ శిక్షాధికారులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ ఏడాది గజపతి జిల్లా 99.35 శాతం ఉత్తీర్ణత సాధించడం ముఖ్యం కాదని.. వచ్చే ఏడాది కూడా ఇంకా ఫస్టుక్లాసులు, ర్యాంకులు పెంచాలని అన్నారు. వరల్డ్ క్రికెట్ కప్పు 2023 ఇండియా టీం ఆస్ట్రేలియాపై గెలిచింది. అదే తీరు జిల్లాలోని శిక్షాధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు పోరాట పటిమ ఉండాలని అన్నారు. మోహానా, ఆర్.ఉదయగిరి, పర్లాకిమిడి, గుసాని సమితి గురండి ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఏ1 సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు మెమొంటోలు, నగదు బహుమతులు ఎమ్మెల్యే రూపేష్ చేతుల మీదుగా కలెక్టర్ అందజేశారు. అలాగే వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులను కూడా కలెక్టర్ మెమొంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.



ఫస్టుక్లాస్ సాధించిన విద్యార్థుల బహుమతి ప్రదానం చేసిన అధికారులు



పేదవిద్యార్థి చంద్రశేఖర దోళాయికి మెమెంటోను అందజేస్తున్న కలెక్టర్ దాస్

మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న యువకులు అరెస్టు



పోలీసులకు పట్టుబడిన నిందితులు



స్వాధీనం చేసుకున్న మత్తు ఇంజక్షన్లు ఇవే

జయపురం: మత్తు కలిగించే ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముగ్గురు యువకులను జయపురం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో స్థానిక ద్వితీయబజారు సమీప నాగార్జి వీధికి చెందిన మున పండ, గోపబందునగర్ నివాసి కృష్ణ టిర్కి, పుర్నాఘడ్ నివాసి సూరజ్ కుమార్ గుప్త ఉన్నారని జయపురం పట్టణ పోలీసు అధికారి ఉల్లభ చంద్ర రౌత్ బుధవారం వెల్లడించారు. వీరి వద్ద నుంచి 322 పెంటజోకెన్ ఏంపుల్స్, 20 యూనిట్ల సిరంజీలతో పాటు స్కూటీని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు వివరించారు. భువనేశ్వర్ నుంచి ఇంజక్షన్‌లు తీసుకొచ్చి స్థానిక యువతకు, కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైందని చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి అనంతరం జైలుకు తరలించినట్లు తెలిపారు.

ముగిసిన నాటక మహోత్సవాలు



ఒడిస్సీ, సంబల్‌పురి నృత్యా కళాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే రూపేష్

పర్లాకిమిడి: రాష్ట్రస్థాయి 11వ నాటక మహోత్సవాలు మంగళవారం రాత్రితో పర్లాకిమిడిలో ఘనంగా ముగిశాయి. స్థానిక టౌన్ హాల్‌లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి నాటక మహోత్సవాల ముగింపు సభకు ముఖ్యఅతిథిగా పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి విచ్చేసి ప్రారంభించారు. ఏటా రాష్ట్ర స్థాయిలో క్రియేటివ్ ఆర్ట్స్ వారు ప్రదర్శిస్తున్న నాటకాలు, కళాకారులు, నిర్వాహకులను ఆయన అభినందించారు. ఆయనతో పాటు సెంచూరియన్ వర్సిటీ డైరెక్టర్ డాక్టర్ దుర్గాప్రసాద్ పాఢి, క్రియేటివ్ ఆర్ట్స్ అధ్యక్షులు నృసింహా చరణ్ పట్నాయక్, కార్యదర్శి మనోజ్ పాఢి, ఆదర్శ దాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దామన్‌జోడికి చెందిన కళాకారులు 'కోలామల్లి'నాటకాన్ని ప్రదర్శించారు. నాటక రచయిత ప్రశాంత కుమార్ దాస్, దర్శకులు శేష్‌దేవ్ శత్పథి, మహారాజా ప్రతాపరుద్ర దేవ్‌గా శ్రీకాంత్ కుమార్ సాహు, బలరాం దాస్‌గా శిశిరో కుమార్ మిశ్రా, కలామల్లిగా శ్రీవిద్యా మిశ్రా, సస్మితా మిశ్రా హాజరయ్యారు. సంగీతం శక్తిప్రసాద్ మిశ్రా, గాత్రం స్మృతికీర్తి మహాపాత్రో తదితరులు నిర్వహించారు. శ్రీజగన్నాథ సంస్కృతి, చరిత్ర, భక్తులకు ఆయన దర్శనం కలుగకుండా అవరోధాలు సృష్టిస్తున్న సేవాయత్‌లు మధ్య కథ నడుస్తుంది.



నాటకంలో బలరాం దాస్, కళామల్లి మధ్య సంభాషణ



మహారాజు ప్రతాప రుద్రదేవ్, బోదోపండా సీన్

ఘనంగా అగ్ని గంగమ్మ పండుగలు



కళాకారులతో మాజీ ఎమ్మెల్యే పీతం పాడి



ర్యాలీలో పాల్గొన్న సీఎల్పీ చీఫ్ రాం ఖడం, మాజీ ఎంపీ జయరాం పంగిలు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా పొట్టంగిలో అగ్ని గంగమ్మ పండుగలు ఘనంగా జరిగాయి. మంగళవారం ఊరంతా పండుగ వాతావరణం నెలకొంది. విచిత్ర వేషాదారణతో ఉన్న కళాకారులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ శాసన సభా పక్ష నాయకుడు, పొట్టంగి ఎమ్మెల్యే రాం చంద్ర ఖడం, మాజీ ఎంపీ జయరాం పంగి, మాజీ ఎమ్మెల్యే పీతం పాఢీలు ర్యాలీలో పాల్గొన్నారు.

సిమిలిగుడ అగ్ని గంగమ్మ పండుగలకు ముందుగా పొట్టంగి అగ్ని గంగమ్మ పండుగలు జరగడం అనాధిగా వస్తున్న ఆచారం.

క్లుప్తంగా

పోలీసుల అదుపులో జ్యూయలరీస్ షాపు యజమాని


పోలీసుల అదుపులో ఎస్‌వీఆర్ జ్యూయలరీస్ యజమాని

విజయనగరం క్రైమ్: స్థానిక గంటస్తంభం వద్ద ఎస్‌వీఆర్ జ్యూయలరీ షాపును రన్ చేస్తున్న యజమానికి వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఆ షాపు యజమాని నాగుల కొండ వెంకట కిశోర్‌పై రెండు ఎన్‌బీడబ్ల్యూ కేసులతో పాటు ఒక ఎస్‌బీఏ కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితుడు గతంలో ఒక మహిళను వేధించాడని అప్పుడే కేసు నమోదైందన్నారు. అలాగే ఒక చెక్‌బౌన్స్ కేసులో కూడా నిందితుడని చెప్పారు. షాపుకు వచ్చిన కొనుగోలుదారులకు నకిలీ బంగారం ఆశ చూపి డబ్బులు కాజేసేవాడన్న ఫిర్యాదులు కూడా వచ్చాయని సీఐ చెప్పారు. ఈ మేరకు షాపు యజమాని కిశోర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టగా రిమాండ్ విధించినట్లు చెప్పారు.

ప్రతిభకు పురస్కారం


అనితను సత్కరిస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయస్వామి తదితరులు

పార్వతీపురం: సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సంక్షేమ వసతి గృహల్లో పదోతరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్షలలో అత్యున్నత ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ మేరకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజేయస్వామి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిలు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పార్వతీపురం సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహంలో 600 మార్కులకుగాను 558 మార్కులు సాధించిన జి.అనితను సన్మానించి ఘనంగా సత్కరించారు. దీనిపై సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి మహమ్మద్ గయాజుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తెర్లాం: తెర్లాం జంక్షన్‌లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు బుధవారం తెర్లాం ఎస్సై సాగర్ బాబు మాట్లాడుతూ మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలియరాలేదన్నారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించామని తెలిపారు. మాసిపోయిన గడ్డం, గళ్ల లుంగీ కట్టుకుని ఉన్నాడని, సుమారు 65 నుంచి 70ఏళ్ల వయస్సు ఉంటుందని తెలియజేశారు. ఫొటోలో చూసి ఎవరైనా గుర్తుపడితే బాడంగి సీహెచ్‌సీకి వచ్చి వివరాలు తెలియజేయాలని కోరారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

కిలో గంజాయితో ఇద్దరి అరెస్టు

రాజాం సిటీ: మండల పరిధి శ్యాంపురం రోడ్డులో కిలో గంజాయితో ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని సీఐ ఉపేంద్రరావు తెలిపారు. బుధవారం శ్యాంపురం రోడ్డులోని అగ్రహారం జంక్షన్ వద్ద ఎస్సై వై.రవికిరణ్‌కు వచ్చిన సమాచారం మేరకు వాహన తనిఖీలు చేపట్టారు. స్కూటీపై వెళ్తున్న కొఠారిపురం గ్రామానికి చెందిన పంచిరెడ్డి వెంకటరమణ, డోలపేటకు చెందిన పూతిక హరిశంకర్‌లను తనిఖీ చేయగా వారి స్కూటీలో గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని రూరల్ సీఐ ఉపేంద్రరావు తెలిపారు.

కుక్కకాటుతో లేగదూడ మృతి

పాలకొండ రూరల్: మండలంలోని రుద్రిపేటలో కుక్కకాటు కారణంగా లేగదూడ మరణించిందని రైతు ప్రసాదరావు బుధవారం తెలిపాడు. కొద్దిరోజుల క్రితం కుక్కకాటుకు గురైన దూడను వెలగవాడ పశువుల ఆస్పత్రికి తీసుకువెళ్లగా రేబిస్ వ్యాక్సిన్ లేదని వైద్యులు పేర్కొన్నట్లు రైతు వాపోయాడు. రూ.1200 వెచ్చించి బహిరంగ మార్కెట్‌లో వ్యాక్సిన్ కొనుగోలు చేయాల్సివచ్చిందని, అయినప్పటికీ దూడ మరణించిందన్నాడు. పశువైద్య కేంద్రాల్లో రేబిస్ వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉంచడంతో పాటు కుక్కలను నియంత్రించాలని కోరాడు.

రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం

రాజాం: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఈఆర్‌వో టి.సవరమ్మ బుధవారం సమావేశమయ్యారు. ఓటరు జాబితాలపై చర్చించారు. పక్కాగా ఓటరు జాబితా తయారీకి సిబ్బందికి సహకరించాలని, ఓటర్లలో మృతుల వివరాలు తెలియజేసి ఓటరు జాబితా నుంచి వారి పేర్లు తొలగించేలా చూడాలని ఈఆర్‌వో కోరారు. కార్యక్రమంలో డీటీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై కాలుష్యం కాటు..!

- మెదడుపై తీవ్ర ప్రభావం
- డిప్రెషన్, మతిమరుపు సమస్యలు
- పార్కిన్‌సన్స్ వచ్చే ఆస్కారం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు


ఇలాంటి పొగతో కాలుష్యం

రాజాం సిటీ: వాహనాల వినియోగం పెరగడంతో పాటు కాలం చెల్లినవి రోడ్లపై పరుగులు తీస్తుండడంతో అధికంగా కాలుష్యం వెలువడుతోంది. నిత్యం ద్విచక్రవాహనాలపై తిరిగే వారికి వాహన కాలుష్యంతో పాటు మానసిక, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. కాలుష్యం కారణంగా రసాయనాలు రక్తంలో కలిసి మెదడుపై ప్రభావం చూపుతాయని పేర్కొంటున్నారు. ఇవి దీర్ఘకాలంలో అనేక దుష్పరిణామాలకు దారి తీస్తాయని వెల్లడిస్తున్నారు. కాలుష్యం కారణంగా సమస్యలకు గురవుతున్న వారిని తరచూ చూస్తున్నామని వైద్యులు తెలియజేస్తున్నారు.

ఏం చేయాలంటే..

- ప్రజలు కాలుష్యం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వీలైనంత వరకు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను వినియోగిస్తే కాలుష్యం బారిన పడకుండా తగ్గించుకోవచ్చు.
- ద్విచక్రవాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్‌తోపాటు సర్జికల్ మాస్క్‌లాంటిది పెట్టుకుంటే మంచిది
- కాలం చెల్లిన వాహనాల వినియోగాన్ని నివారించాలి
- ఎలక్ట్రిక్ వాహనాల వాడకంపై దృష్టి సారించాలి. అలాగే రోడ్ల వెంట విరివిగా మొక్కలు నాటితే కాలుష్య ప్రభావాన్ని కొంతవరకు తగ్గిస్తాయి.

అదుపులో ఉండని దీర్ఘకాలిక వ్యాధులు..

కాలుష్య ప్రభావానికి గురయ్యే వ్యక్తుల్లో దీర్ఘకాలిక వ్యాధులు అదుపులో ఉండవు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలి. వ్యాధులు అదుపులో లేకపోవడంతో కీలక అవయవాలపై ప్రభావం చూపుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గుండెపోటు, కిడ్నీల ఫెయిల్యూర్, రక్త ప్రసరణ తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరిస్తున్నారు.

సమస్యలివే..

- ✔ మెదడు కుచించుకుపోయి మతిమరుపు వస్తుంది
- ✔ రక్తంలో కలిసిన రసాయనాలు మెదడులోని కీలక భాగాలపై ప్రభావం చూపుతాయి. ఫలితంగా నరాలసమస్యతో కాళ్లు, చేతులు పనిచేయని పరిస్థితి ఎదురవుతుంది. కొందరికి పక్షవాతం కూడా రావచ్చు.
- ✔ వాసన గ్రహించలేకపోతారు.
- ✔ పార్కిన్‌సన్ (వణుకుడు రోగం) వ్యాధి రావచ్చు
- ✔ డిప్రెషన్‌కు గురవుతుంటారు
- ✔ హార్మోన్స్ సక్రమంగా రిలీజ్ కావు
- ✔ పిల్లల్లో ఎదుగుదల సమస్య తలెత్తవచ్చు
- ✔ ఫిట్స్, మైగ్రేన్, తలనొప్పి రావచ్చు

జన్యుపరమైన లోపాలే కాకుండా సమతుల్య ఆహార విధానలేమి, శ్రమలేని జీవన విధానాల వంటి వాటితో పాటు పర్యావరణ సంబంధిత వాహన కాలుష్యం వంటివి కూడా మధుమేహవ్యాధి సంక్రమించడానికి ముఖ్యభూమిక పోషిస్తాయని పరిశోధనలు చెబుతున్నాయి.

మెదడుపై ప్రభావం..



కాలుష్యం మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. బ్రెయిన్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. మెదడులో కీలక భాగాలపై కాలుష్యంలోని రసాయనాలు ప్రభావంచూపి న్యూరోలాజికల్ సమస్యలు తలెత్తవచ్చు. కాలు చేయి పట్టు తప్పడం, బ్రెయిన్‌స్ట్రోక్, వణుకుడు రోగం వంటివి రావచ్చు. కాలుష్యం బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా పట్టణంలో తిరిగేవారు మాస్క్‌ధరించడం మంచిది.

డాక్టర్ కరణం హరిబాబు, సూపరింటెండెంట్, ప్రాంతీయ ఆస్పత్రి, రాజాం

మధుమేహం వచ్చే ప్రమాదం..



నైట్రోజన్ డయాక్సైడ్ అధికంగా ఉన్న గాలిని పీల్చేవారు మధుమేహం బారిన పడతారు. గాలిలో 2.5 మైక్రో మీటర్లకన్నా తక్కువ పరిమాణం ఉన్న కాలుష్య పదార్థాలు ఊపిరితిత్తుల ద్వారా శరీరంలో చేరి ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను పెంచడమే కాకుండా ఇన్‌ఫ్లమేషన్ ప్రక్రియను ప్రేరేపించడం ద్వారా ఇన్సులిన్ నిరోధకతకు కారణమై మధుమేహానికి దారితీస్తాయి. వాహనాల శబ్దకాలుష్యంతో నిద్రలేమి, తీవ్రమైన ఒత్తిడితో హార్మోన్లు, మెటబాలిజం అసమతుల్యతతో ఇన్సులిన్ నిరోధకత ఏర్పడుతుంది. ఫలితంగా మధుమేహం రావచ్చు.

డాక్టర్ ఎం.కోటేశ్వరరావు, ప్రాంతీయ ఆస్పత్రి, రాజాం

మలేరియా నిర్మూలనకు ఏసీఎం స్ప్రేచేయాలి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతు మాధవన్


జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ సేతు మాధవన్

విజయనగరం ఫోర్ట్: మలేరియా నిర్మూలనకు ఇంటి లోపల గోడల మీద ఏసీఎం 5శాతం 9 ఆల్ఫా సైఫర్ మెత్రిన్ స్ప్రే చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ అన్నారు. దీని కోసం జిల్లావ్యాప్తంగా 157 గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలో అమలు చేయనున్న మలేరియా నిర్మూలన కార్యక్రమంపై వ్యాధి ఎక్కువగా ఉన్న 18 మండలాలకు చెందిన ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు, వైద్యాధికారులు, మలేరియా సబ్‌యూనిట్ అధికారులతో ఆయన బుధవారం తన చాంబర్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలేరియా వ్యాప్తిని నిరోధించడానికి మొత్తం 22 పీహెచ్‌సీల పరిధిలోని 157 గ్రామాల్లో రెండు విడతలుగా ఏసీఎం మందును పిచికారీ చేయనున్నట్లు తెలిపారు. గడిచిన నాలుగేళ్ల నివేదికల అధారంగా ప్రతి వెయ్యిమంది జనాభాకు రెండు లేదా అంతకన్నా ఎక్కువ మలేరియా కేసులు నమోదైన గ్రామాలను మలేరియా ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించి ఈ కార్యక్రమానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. దీనిలో భాగంగా మే 1నుంచి జూన్ 15 వరకు మొదటి విడత, జూలై ఒకటి నుంచి ఆగస్టు 15 వరకు రెండో విడత ఏసీఎం మందులను పిచికారీ చేయనున్నట్లు తెలిపారు. దీని వల్ల గోడలపై వాలే దోమలు శక్తిని కోల్పోయి క్రమంగా నశించిపోతాయన్నారు. ఇలా మందు పిచికారీ చేసినప్పుడు ఆ ఇంటి గోడలపై 10 నుంచి 12 వారాల పాటు ఆ మందు ప్రభావం ఉంటుందని, ఆలోగా గోడలను కడగడం గాని సున్నం వేయడం గాని చేయకూడదని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి సంపూర్ణ సహకారం అవసరమని కోరారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి, డీఎంఓ వై.మణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నాలుగు పారిశ్రామిక పార్కులు

- 9,10 తేదీల్లో శంకుస్థాపన

విజయనగరం రూరల్: జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి బాటలు వేస్తూ చిన్న పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేయనుంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఒక ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా తొలివిడతలో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో పారిశ్రామిక వాడల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మే 1వ తేదీన నెల్లూరు జిల్లా నుంచి ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ పార్కులను ఆయా నియోజకవర్గాల పరిధిలో పారిశ్రామిక వాడలు ఏర్పాటు చేసే ప్రాంతంలో ప్రారంభించే కార్యక్రమానికి ఆయా నియోజకవర్గ శాసనసభ్యులతో కలిసి రాష్ట్ర చిన్న మధ్యతరహా పరిశ్రమలు, ఎన్ ఆర్ఐ వ్యవహారాలు, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శ్రీకారం చుట్టనున్నారు. జిల్లాలో తొలివిడతగా ఎస్.కోట, నెల్లిమర్ల, గజపతినగరం, బొబ్బిలి నియోజకవర్గాల్లో 127.58 ఎకరాల్లో రూ.47.35 కోట్ల వ్యయంతో పారిశ్రామిక వాడలు ఏర్పాటు కానున్నాయి. రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(ఏపీఐఐసీ) ఆధ్వర్యంలో ఈ ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు కానున్నట్లు ఆ సంస్థ జోనల్ మేనేజర్ ఎం.మురళీమోహన్ వెల్లడించారు. మే 9వ తేదీ ఉదయం 9 గంటలకు ఎస్.కోట నియోజకవర్గం పరిధి బలిఘట్టంలో 57.09 ఎకరాల్లో రూ.7 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక వాడకు మంత్రి శంకుస్థాపన చేస్తారని, తొలిదశలో ఇక్కడ 20 ఎకరాల్లో పార్కు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 4 గంటలకు నెల్లిమర్ల నియోజకవర్గ పరిధిలో నెల్లిమర్ల ఎఫ్.ఎస్.సి.లో 15.55 ఎకరాల్లో రూ.15.55 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక వాడకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. 10వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కొండకిండాంలో 57.49 ఎకరాల్లో రూ.17.89 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న పారిశ్రామిక వాడకు, ఉదయం 11 గంటలకు బొబ్బిలి నియోజకవర్గం పరిధి కొట్టక్కిలో 10 ఎకరాల్లో రూ.7 కోట్ల వ్యయంతో ఏర్పాటు కానున్న పార్కుకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఆయా నియోజకవర్గ శాసనసభ్యులు, జిల్లా అధికారులు పాల్గొంటారని వెల్లడించారు.

అగ్నిఅస్త్రం తయారీపై అవగాహన


అగ్నిఅస్త్రం తయారీని చేసి చూపిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో అగ్నిఅస్త్రం తయారీపై బుధవారం అవగాహన కల్పించారు. ఏవో జి.మురళీకృష్ణ మాట్లాడుతూ తెగుళ్లను తట్టుకునే పంటలు కావాలన్నా, అధిక దిగుబడులు రావాలన్నా ప్రకృతి సేద్యం అవలంబించాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ పంటలు సాగు చేస్తే ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం అగ్నిఅస్త్రం తయారీని ప్రయోగాత్మకంగా వివరించి, చూపారు.

ఆవుమూత్రం 10 లీటర్లు, పొగాకు కిలో, వెల్లుల్లి అరకిలో, పచ్చిమిర్చి అరకిలో, వేపాకులు 5 కిలోలను ఒక మట్టి కుండలో వేసి అందులో 10 లీటర్ల గోమూత్రం వేసి బాగా కలపాలన్నారు. మరగబెట్టిన తర్వాత పలుచని గుడ్డలో వడకట్టి డబ్బాలో వేసి మూడు నెలల వరకు నిల్వ ఉంచి వినియోగించుకోవచ్చన్నారు. ఎకరానికి 5 లీటర్ల అగ్నిఅస్త్రం 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోలన్నారు. ఆయన వెంట సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ పొగిరి అప్పలనాయుడు, ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురంలో నవధాన్యాల సాగు-దాని ద్వారా కలిగే ప్రయోజనాలపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రధాన పంట వేసే ముందు పొలాల్లో నవధాన్యాలు వేసుకుని సాగు చేయాలని, అవి మొక్కలైన 40 రోజుల తర్వాత అదే నేలలో దున్నితో నేల సారవంతమైన పంట దిగుబడి బాగుంటుందన్నారు.

చామలాపల్లిలో దారుణ హత్య

- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు
- ప్రాణం తీసిన వివాహేతర సంబంధం!

శృంగవరపుకోట: భార్య దూరం అయ్యేందుకు కారణమైన వ్యక్తిపై పగబట్టాడు. చివరకు ఆ వ్యక్తిని హత్యచేసి పోలీసులకు లొంగిపోయిన ఘటన ఎస్.కోట మండలం చామలాపల్లిలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్.కోట సీఐ వి.నారాయణమూర్తి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తొత్తడి ప్రసాద్(38), నడుపూరి మురళీకి మధ్య కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. మురళీ భార్య రెండేళ్లుగా భర్తకు దూరంగా ఇద్దరి కుమార్తెలతో కలిసి పుట్టింట్లో ఉంటోంది. ఇంటికి రావాలని ఇటీవల మురళీ పిలిచినా ఆమె రాలేదు. భార్య తన నుంచి విడిపోవడానికి ప్రసాద్ కారణమని మురళీ భావించాడు. పలుసార్లు ప్రసాద్‌ను చంపేస్తానంటూ గ్రామస్తుల వద్ద హెచ్చరికలు చేశాడు. అదును కోసం ఎదురు చూశాడు. గ్రామంలోని ఓ ఇంటి వద్ద పెళ్లి సామాన్లు దించుతున్న ప్రసాద్‌పై కత్తితో దాడిచేశాడు. తల, మెడపై నరకడంతో ప్రసాద్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హత్య చేసిన మురళి ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. హత్యకు కారణాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

మద్యం మత్తులో ఓ పోలీస్..!

- కారు నడిపి ఆటోను ఢీకొట్టి..
- ఒకరి మృతికి కారణమై..
- వాహనం నంబర్ ప్లేట్ మార్చి..
- నిందితుడిని కాపాడే ప్రయత్నంలో పోలీసులు
- బాధితులకు అండగా సీపీఎం


ప్రమాదం జరిగినప్పుడు ఉన్న ఓన్ కారు నంబర్ ప్లేట్


పోలీస్ స్టేషన్‌కు అప్పగించిన కారు టాక్సీ నంబర్ ప్లేట్

గరుగుబిల్లి/పార్వతీపురం రూరల్: గరుగుబిల్లి మండల పరిధిలోని సీతారాంపురం జంక్షన్‌లో మంగళవారం సాయంత్రం పోలీస్‌వాహనం ముందు వెళ్తున్న ఆటోను వెనుకనుంచి ఢీకొట్టడంతో ఉల్లిభద్ర గ్రామానికి చెందిన బి.గణేష్ (42)కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు పార్వతీపురం జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. అయితే ప్రమాదం జరిగిన విషయం బయటకు రాకుండా నిందితుడు తనవంతు ప్రయత్నాలు చేశాడు. సంఘటనలో తీవ్ర గాయాలపాలైన గణేష్ చికిత్సపొందుతూ మృతి చెందడంతో పోలీసులకు బుధవారం సమాచారం అందించగా స్థానిక ఎస్సై కేసు నమోదు చేశారు.

మద్యం మత్తులో వాహనం నడిపిన పోలీసు

ప్రజల ప్రాణాలను రక్షించాల్సిన పోలీసులే నిబంధనలకు విరుద్ధంగా మద్యం తాగి వాహనం నడిపి ఒకరి మృతికి కారణమయ్యారు. జియ్యమ్మవలస మండల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎ.ప్రసాద్ డ్యూటీ డ్రెస్‌లో ఉండి మద్యం తాగి కారు నడిపి ముందు వెళ్తున్న ఆటోను బలంగా ఢీకొట్టాడు. ఈ విషయమై చినమేరంగి సీఐ టీవీ తిరుపతిరావు వద్ద ప్రస్తావించగా ప్రమాదం జరిగిన సమయంలో కానిస్టేబుల్ ప్రసాద్ మద్యం తాగి ఉన్నాడా? లేదా? అని మెడికల్ టెస్టులు, రక్త పరీక్షలు చేయించామని, తదుపరి చర్యల నిమిత్తం పార్వతీపురం ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డికి నివేదించినట్లు తెలిపారు.

నంబర్ ప్లేట్‌ను మార్చిన పోలీసులు


గణేష్ మృతదేహం

ప్రమాదం జరిగినప్పుడు కారుకు ఓన్‌బోర్డు ఉన్న నంబర్ ప్లేట్‌ను బుధవారం ఉదయానికి ట్యాక్సీ నంబర్ ప్లేట్‌గా (ఎల్లోబోర్డు) మార్చివేశారు. మార్చిన నంబర్ ప్లేటుతోనే కారును గరుగుబిల్లి పోలీస్ స్టేషన్‌లో పెట్టారు. న్యాయాన్ని కాపాడాల్సిన పోలీసులు ఇలా నంబర్ ప్లేట్లను మార్చి చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని బాధితులకు అన్యాయం చేయడంతో పాటు చట్టాన్ని పక్కదోవ పట్టించేలా వ్యవహరించడంపై ఔరా అంటూ పలువురు ముక్కున వేలు వేసుకుంటున్నారు.

బాధితులకు అండగా సీపీఎం

మంగళవారం సాయంత్రం ప్రమాదం జరిగినప్పటికీ బుధవారం ఉదయం వరకు కేసు నమోదు చేయకపోవడంపై సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బీవీ రమణ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ మేరకు బుధవారం కేసు నమోదుపై ఎందుకు తాత్సారం చేస్తున్నారని పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందిని ప్రశ్నించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిందితుడైన కానిస్టేబుల్‌ను రక్షించేందుకు పోలీసు సిబ్బంది తమ వంతు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆటో డ్రైవర్ మృతి చెందడంతో తప్పనిసరి పరిస్థితిలో కేసును నమోదు చేశారు తప్ప బాధితులకు న్యాయం చేద్దామని కాదన్నారు. ప్రమాదంపై తక్షణం విచారణ నిర్వహించి కానిస్టేబుల్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, మరణించిన గణేష్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నంబర్ ప్లేట్‌లు మార్చడం పట్ల, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రహదారి నిబంధనలు పోలీసులకు వర్తించవని ఈఘటనతో తెలుస్తోందన్నారు. ఈ నిరసనలో సీపీఎం నాయకులు కె. రవీంద్ర, డి.వెంకటనాయుడు, వై.మన్మథరావుతోపాటు పలువురు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బుధవారం సాయంత్రం ఉల్లిభద్ర జంక్షన్ వద్ద ప్రమాదంలో మృతిచెందిన గణేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ మహిళలు, పెద్దలు, యువత పెద్ద ఎత్తున ఆందోళన చేసి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దీంతో ట్రాఫిక్‌కు పూర్తిగా అంతరాయం ఏర్పడింది. స్థానిక ఎస్సై రమేష్ నాయుడు ధర్నా స్థలానికి వచ్చి బాధితులకు న్యాయం చేస్తామని భరోసా ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


ఉల్లిభద్ర జంక్షన్ వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

కొత్త రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోండి

బొబ్బిలిరూరల్: కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు ఎం.శ్రీనుఓ ప్రకటనలో బుధవారం కోరారు. కొత్తగా పెళ్లయిన జంటలు కొత్త కార్డుల కోసం, పాతకార్డుల్లో మృతుల పేర్లు తొలగింపు, కొత్త వ్యక్తుల పేర్ల నమోదు వంటి వాటి కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అసంఘటిత కార్మికులకు బీమా

వంగర: అసంఘటిత కార్మికులంతా బీమా చేయించుకోవాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.కొండలరావు అన్నారు. బుధవారం మండలంలోని మద్దువలస గ్రామంలో పలువురు అసంఘటిత కార్మికులతో ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేయించారు. 18 నుంచి 59 ఏళ్ల వయసు కార్మికులంతా బీమా సదుపాయం పొందేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డుకు లిక్ అయిన మొబైల్ నంబర్‌తో నమోదు కావాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ప్రమాదవశాత్తు పాక్షిక వైకల్యం కలిగితే రూ.1 లక్ష, శాశ్వత వైకల్యం లేదా మరణిస్తే రూ.2 లక్షల బీమా పరిహారం అందుతుందని లేబర్ ఆఫీసర్ తెలిపారు.

దర్యాప్తు నైపుణ్యం మెరుగుపరచడమే లక్ష్యం

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, వైద్యులు, పోలీస్ శాఖ అధికారులు

పార్వతీపురం రూరల్: వివిధ కేసులకు సంబంధించిన దర్యాప్తులలో నైపుణ్యాలను మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పర్యవేక్షణలో ఫోరెన్సిక్ నిపుణులతో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో ఫోరెన్సిక్ నిపుణులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ వైద్యులు పాల్గొని పలు అంశాలపై వివరించి శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ నేరస్థలం పరిశోధనలో దర్యాప్తు అధికారులు ఆధారాలు సేకరించాల్సిన సమయంలో అందుకు అనుగుణంగా నేరం జరిగిన చోటుకు పోలీసులు ఏవిధంగా రక్షణ కల్పించాలో, అలాగే డీఎన్ఏ, రక్త నమూనాలు, అవయవాలు, వెంట్రుకలు, నార్కోటిక్స్, మత్తు పదార్థాలు, వివిధ రకాల విషపదార్థాలు, ఆడియో, వీడియో, ప్రధానమైన పలు నేరాలు రుజువు చేసేందుకు అవసరమయ్యే అన్ని సాక్ష్యాధారాలను భౌతికంగా ఏ విధంగా సేకరించాలి? అలాగే ప్యాకింగ్, నిల్వ భద్రపరచడం, ల్యాబ్ నుంచి వచ్చే నివేదికను వారంలోనే పొందే విధానం, కోర్టుకు తీసుకువెళ్లే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు వంటి ప్రధానమైన అంశాలపై వర్క్‌షాప్ జరిగినట్లు ఎస్పీ తెలిపారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఫోరెన్సిక్ నిపుణులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ వర్క్‌షాపులో పాలకొండ డీఎస్పీ రాంబాబు, డీసీఆర్‌బీ సీఐ ఆదాం, సీఐ అప్పారావు, ఫోరెన్సిక్ నిపుణులు ఎం.రాంబాబు, ఎస్.నళిని, వి.ప్రశాంతి, గోపాలకృష్ణతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ వైద్యులు అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న సీఐలు, ఎస్సైలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

9లోగా ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

- జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటుచేసిన స్కిల్ హబ్ ట్రైనింగ్ సెంటర్లలో మూడు నెలల కాలపరిమితితో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె.సాయి కృష్ణ చైతన్య బుధవారం తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఒక్కో నియోజకవర్గంలో 120 మంది చొప్పున నాలుగు నియోజక వర్గాల్లో వెరసి మొత్తం 480 మందికి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఉచిత శిక్షణ పొందేందుకు కనీసం పదోతరగతి తప్పనిసరని, అర్హత, ఆసక్తి వున్న నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నియోజకవర్గాల వారీ శిక్షణ ఇచ్చే ప్రదేశాలు, కార్యక్రమాల వివరాలు

- పార్వతీపురం నియోజకవర్గంలోని ఎమ్మార్ నగరం ప్ర భుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ వాయిస్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కో ర్సులపై శిక్షణ ఇస్తారన్నారు. ఇతర వివరాల కోసం ఫోన్ 9177297528 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.
- కురుపాం నియోజకవర్గంలో గుమ్మలక్ష్మీపురం జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో డొమెస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ అటెండెంట్, రిసెప్షనిస్ట్ కోర్సులకు సంబంధిచి శిక్షణ ఇస్తారని, మరిన్ని వివరాల కోసం ఫోన్ 63034 93720 నంబర్‌ను సంప్రదించాలన్నారు.
- పాలకొండ నియోజకవర్గంలో సీతంపేటలోని గవర్నమెంట్ ఐటీఐ కళాశాలలో శాంప్లింగ్ టైలర్, ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులకు సంబంధించి శిక్షణ ఇస్తారని వివరాల కోసం ఫోన్ 88976 77564 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.
- సాలూరు నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డొమెస్టిక్ ఐటీ హెల్ప్‌డెస్క్ అటెండెంట్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు సంబంధించి శిక్షణ ఉంటుందని వివరాల కోసం ఫోన్ 73825 59022 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.